## నాడు బురదమయం..నేడు డ్రైనేజీలు..



గతంలో లక్ష్మీపూర్ గ్రామంలో సైడ్ డ్రైనేజీ లేక ఇంటి ముందు పేరుకుపోయిన పూడికను తీస్తున్న కార్మికులు



ప్రస్తుతం లక్ష్మీపూర్ గ్రామంలో నిర్మించిన సైడ్ డ్రైనేజీలు

సూరారం గ్రామ పంచాయతీలోని లక్ష్మీపూర్ గ్రామంలో గతంలో సైడ్ డ్రైనేజీలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వర్షా కాలంలో మురుగు నీరంతా రోడ్లపై పారుతుండడంతో రోగాల బారిన పడేవారు. దోమలు, ఈగలు బెడదతో ఇబ్బంది పడేవారు. గతంలో ఎన్నిసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా ఎవరూ పట్టించుకోలేదు. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య దృష్టికి సమస్యను తీసుకువెళ్లగా డీఎంఎఫ్‌టీ నిధులు రూ. 5 లక్షలు మంజూరు చేశారు. దీంతో గ్రామంలో సైడ్ డ్రైనేజీలు నిర్మించారు. దీంతో వర్షం నీరు, మురుగు నీరు సైడ్‌డ్రైనేజీల ద్వారా సాఫీగా వెళ్తుండడంతో సమస్య పరిష్కారమైంది. ఇబ్బందులు తొలగించినందుకు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

–వేమనపల్లి, అక్టోబర్ 19

నాడు నేడు

### పేకాడుతూ పట్టుబడ్డ ఇద్దరిపై కేసు

బెల్లంపల్లిరూరల్, అక్టోబర్ 19: బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో గురువారం గద్దల కుమార్, నిట్టూరి రాజేశ్ పేకాడుతుండగా పట్టుకున్నట్లు బెల్లంపల్లి వన్‌టౌన్ సీఐ బన్సీలాల్ తెలిపారు. వీరివద్ద నుంచి రూ.750 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో ఎక్కడా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని చెప్పారు. ఇలాంటి వారిపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

### మద్యం పట్టివేత

బెల్లంపల్లిరూరల్, అక్టోబర్ 19: బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో కిరాణాషాపులో నిర్వహిస్తున్న బెల్ట్‌షాపుపై గురువారం దాడి చేసి 11 ఆఫీసర్స్ చాయిస్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు బెల్లంపల్లి వన్‌టౌన్ సీఐ బన్సీలాల్ తెలిపారు. పట్టుబడిన మద్యం బాటిళ్లను పంచనామా నిర్వహించినట్లు తెలిపారు. బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న బోడకుంట గణేశ్ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## పోలింగ్ స్టేషన్‌లో వసతులు కల్పించాలి

- ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్
- అభివృద్ధి పనులపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

తాండూర్, అక్టోబర్ 19 : ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో అభివృద్ధి పనులపై ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగే పోలింగ్ స్టేషన్‌లలో కనీస సౌకర్యాలు ఉండేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్, తాగునీరు, టాయిలెట్లు, ర్యాంపు సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించి వాటి నిర్వహణలో ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ, ఏపీవో నందకుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి పై కేసు

బెల్లంపల్లిరూరల్, అక్టోబర్ 19: పట్టణంలోని బెల్లంపల్లిబస్తీలో గురువారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు బెల్లంపల్లిబస్తీలోని సింగరేణిబంకర్ వద్ద బూదిదగడ్డబస్తీకి చెందిన అమరదీప్‌ను పట్టుకొని అతని వద్ద నుంచి 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ బన్సీలాల్ తెలిపారు. అమరదీప్‌ను విచారించగా కొంతకాలంగా బల్లార్ష నుండి తక్కువ ధరకు గంజాయి కొని బెల్లంపల్లిలోని యువకులకు ఎక్కువ ధరకు అమ్ముడమే కాకుండా తాను కూడా సేవిస్తున్నట్లు తేలిందన్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. బెల్లంపల్లి పట్టణంలో గంజాయి సేవించే, సరఫరా చేసే వ్యక్తులపై నిఘా ఉంచినట్లు తెలిపారు. గంజాయి సేవించినా, విక్రయించినా కేసు నమోదు చేయడమే కాకుండా పీడీయాక్ట్ కూడా నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. ఇలాంటి వారిపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన



కాసిపేట : పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఎంఏ అలీం

కాసిపేట, అక్టోబర్ 19 : కాసిపేట మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో ఎంఏ అలీం పరిశీలించారు. పెద్దనపల్లి, సోమగూడెం(కే), కాసిపేట, ముత్యంపల్లిలోని అసెంబ్లీ పోలింగ్ స్టేషన్లను పరిశీలించి, అవసరమైన ఏర్పాట్లను చేయాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవో వెంట ఎంపీవో నాగరాజు, ఆయా పంచాయతీ కార్యదర్శులున్నారు.

## పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం చేయద్దు

- డివిజన్ పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు



జన్నారం చింతగూడలో డంప్‌యార్డును పరిశీలిస్తున్న డివిజన్ పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు

జన్నారం, అక్టోబర్ 19 : పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం చేయవద్దని పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, కార్మికులను మంచిర్యాల డివిజన్ పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు ఆదేశించారు. గురువారం జన్నారం మండలంలోని చింతగూడ గ్రామంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్ని వార్డులను తిరిగి పారిశుధ్య పనులను పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువును తయారు చేయాలన్నారు. డ్రైనేజీల్లో, రోడ్లపై చెత్త తొలగించాలన్నారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి రమేశ్, సర్పంచ్ ఆరే జ్యోతి, శిరీష్ ఉన్నారు.

### రూ. 4. 15 లక్షలు పట్టివేత



సిర్పెల్లి (హెచ్) వద్ద పట్టుబడ్డ నగదుతో పోలీసులు

భైంసాటౌన్, అక్టోబర్, 19: భైంసా- నిర్మల్ రహదారి మాటేగాం టోల్‌ప్లాజా సమీపంలో రూ. 65 వేలు స్వాధీనం చేసుకున్న ట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. గురువారం భైంసారూరల్ పోలీసులు ఈ మార్గంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. లక్ష్మెట్టిపేట్ నుంచి భైంసాకు కారులో వస్తున్న షాహిద్ వద్ద రూ. 65 వేల నగదును గుర్తించారు. ఎన్నికల కోడ్ అమలులో నేపథ్యంలో నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

#### మద్యం పట్టివేత

మండలంలోని చింతల్‌బోరి గ్రామానికి చెందిన శంకర్ మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ ఐ శ్రీకాంత్ తెలిపారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా గురువారం మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారంతో దాడులు నిర్వహించి రూ. 25 వేల మద్యం స్వాధీనం చేసుకుని కేసు న మోదు చేసినట్లు వెల్లడించారు.

#### కుభీర్‌లో రూ.3.50 లక్షలు

కుభీర్, అక్టోబర్ 19: కుభీర్ మండలంలో ని సిర్పెల్లి(హెచ్) చెక్ పోస్టు వద్ద తనిఖీల్లో రూ.3.5లక్షలు నగదు పట్టుబడినట్లు కుభీ ర్ ఎస్‌ఐ ఎండీ షరీఫ్ తెలిపారు. కుభీర్‌లో ని పోలీస్ స్టేషన్లో గురువారం ఆయన ప ట్టుబడ్డ నగదుకు సంబంధించిన వివరాల ను వెల్లడించారు. రోజూ వారీగానే వాహనాల తనిఖీ చేస్తుండగా, మహారాష్ట్రలోని భోఖర్‌కు చెందిన గణేశ్ వద్ద ఈ నగదు పట్టుబడిందని, ఎలాంటి పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు వివరించారు.

## కూరగాయల సాగుతో అధిక లాభాలు

- మహిళలు వ్యవసాయం రంగంలో రాణించాలి
- బెల్లంపల్లి ఏడీఏ సురేఖ

తాండూర్, అక్టోబర్ 19 : మహిళా రైతులు వ్యవసాయ రంగంలో రాణిస్తూ కూరగాయల పంటలు సాగు చేసి తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు సాధించాలని బెల్లంపల్లి ఏడీఏ సురేఖ రైతులకు సూచించారు. గురువారం ద్వారకాపూర్‌లో వ్యవసాయ పంట క్షేత్రాలను సందర్శించారు. పత్తి పంటలో తీసుకోవాల్సిన సంరక్షణ చర్యలపై రైతులకు సూచనలు చేశారు. వ్యవసాయ ఆధారిత కుటుంబాల్లో మహిళలు భాగస్వామ్య పాత్ర పోషించాలని తెలిపారు. మహిళలు వ్యవసాయ రంగంలో రాణిస్తూ ఆహారపంటల ఉత్పత్తికి తోడ్పడాలన్నారు. మహిళా రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదన్నారు. కూరగాయల పంటల సాగుతో కలిగే లాభాలపై రైతులకు వివరించారు. డిమాండ్‌కు అనుగుణంగా కూరగాయల పంటలు సాగు చేయాలని సూచించారు. రైతులు, తదితరులు ఉన్నారు.